సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



ఆపేదెవరు?
అనుమతులు లేకుండా ఒకరు. పర్మిషన్ పేరిట మరికొందరు పట్టపగలే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. 8లో ▸



ఉద్యమాన్ని ఆపలేరు
అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు బి.వెంకటేశ్ అన్నారు. 8లో ▸



అదును దాటకముందే..
ఆరుగాలం శ్రమించి పచ్చని సిరులు పండిస్తున్న పుడమి పుత్రులు యాసంగి వరి సాగుకు సిద్ధమయ్యారు. 9లో ▸

న్యూస్‌రీల్

అస్వస్థతకు గురైన విద్యార్థిని డిశ్చార్జ్

తాండూరు టౌన్: పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల వసతి గృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందిన విద్యార్థిని లీలావతి డిశ్చార్జ్ అయ్యారు. ఈ నెల 10న ఫుడ్ పాయిజన్ వలన 11 మంది విద్యార్థినులు ఆస్పత్రి పాలన విషయం విధితమే. ఈ ఘటనలో లీలావతి ఆరోగ్యం విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఈ నెల 13న నగరంలోని నిమ్స్‌లో చేర్పించారు. చికిత్స అనంతరం బాలిక ఆరోగ్యం మెరుగుపడటంతో బుధవారం రాత్రి ఇంటికి పంపినట్లు గిరిజనాభివృద్ధి జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి తెలిపారు. మిగతా బాలికలు క్షేమంగానే ఉన్నారని పేర్కొన్నారు.

రైతులకు ప్లాట్ల పట్టాలు పంపిణీ



ప్లాట్ల పట్టాలు అందజేస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్: మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణంలో భూములు కోల్పోతున్న అప్పాయిపల్లి గ్రామ రైతులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ ప్రారంభించింది. గురువారం తహసీల్దార్ విజయ్‌కుమార్, సబ్ రిజిస్ట్రార్ రవికాంత్‌లు బాధిత రైతులకు ప్లాట్ల పట్టాలు అందజేశారు. డీటీసీపీ లేఅవుట్ ద్వారా ప్రభుత్వమే రైతులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని అధికారులు వెల్లడించారు.

పాత ధరకే పత్తి కొనుగోళ్లు

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: 'పత్తి రైతులకు తప్పని తిప్పలు' అనే శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్ధమ్మ స్పందించారు. గురువారం నాగసమందర్ కాటన్‌మిల్లును తనిఖీ చేశారు. బుధవారం రాత్రి వరకు తూకం వేయగా మిగిలిన 68 పత్తి లోడుతో ఉన్న వాహనాలతో పాటు, ఉదయం వచ్చిన 7 వాహనాలను కలిపి దిగుబడిని తూకం వేయించారు. రైతులకు పాత ధర ప్రకారమే క్వింటల్‌కు రూ.7,471 చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. పత్తి మిల్లుకు వస్తున్న రైతుల వాహనాలకు టోకెన్లు జారీచేశామని పేర్కొన్నారు. దళారుల పత్తిని కొనుగోలు చేయనివ్వమని స్పష్టంచేశారు. అర్హులైన రైతులు ఆధార్‌కార్డు, అకౌంట్ నంబర్ ఇస్తే వారి పేరున టోకెన్లు జారీచేసి, కొనుగోలు చేసేందుకు అనుమతి ఇస్తామని వెల్లడించారు.

మూడు రోజులు బంద్

నాగసమందర్ పత్తి మిల్లులో నిల్వలు పేరుకుపోయాయని, పత్తిని జిన్నింగ్ చేయడానికి సమయం పడుతుందని కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు. శుక్ర, శని, ఆదివారాలు మిల్లు బంద్ ఉంటుందని పేర్కొన్నారు. రైతులెవరు పత్తిని తీసుకురావద్దని సూచించారు. సోమవారం నుంచి తెవాలని, క్వింటాల్‌కు రూ.7,421 చొప్పున చెల్లించి కొనుగోలు చేయనున్నారని వెల్లడించారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.50 ధర తగ్గించిందని గుర్తు చేశారు.

కేర్ టేకర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

కుల్కచర్ల: మండల పరిధి ముజాహిద్‌పూర్ గ్రామపంచాయతీ పరిధి మోడల్ స్కూల్‌కు అనుబంధంగా ఉన్న స్కూల్ హాస్టల్‌లో కేర్ టేకర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏదేని డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, అభ్యర్థి కుల్కచర్ల మండల పరిధి గ్రామానికి చెందిన వారై ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కేజీబీవీ పాఠశాలను సంప్రదించాలని సూచించారు.

నచ్చిన రంగాల్లో రాణించాలి

నందిగామ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని నవోదయ విద్యాలయ సమితి జాయింట్ సెక్రటరీ జ్ఞానేంద్రకుమార్ పిలుపు నిచ్చారు. గురువారం కన్హా శాంతి వనంలో నవోదయ విద్యాలయ జాతీయ సమైక్యతా సమ్మేళనం 2024- 25 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని నవోదయ విద్యాలయాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వీటిలో చదివిన ఎంతో మంది అత్యున్నత స్థానాలకు ఎదిగారని తెలిపారు. నవోదయ సమ్మేళనంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించిన సుమారు 661 నవోదయ విద్యాలయాలకు చెందిన 436 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఆయా రాష్ట్రాల విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్, జానపద నృత్యాలు, సంగీత కచేరీ, కూచిపూడి, టాయ్స్ ఆర్ట్స్, పెయింట్ ఎగ్జిబిషన్, తబలా వాయిద్యం అలరించాయి. ఏపీ రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, రిటైర్డ్ ఐఏఎస్ మురళి ఉన్నారు.

ఆయకట్టు బీళ్లు అన్నదాత కన్నీళ్లు!



❖ ఐదు దశాబ్దాల క్రితం..

జిల్లాలోని అనంతగిరుల్లో పుట్టిన కాగ్నా నది ధారూరు, పెద్దేముల్, యాలాల, తాండూరు, బషీరాబాద్ మండలాల మీదుగా ప్రవహిస్తూ ఇందర్‌చెడ్ దగ్గర దిగువనున్న కర్ణాటకలో కలుస్తుంది. వర్షాకాలంలో ఎగువన కురిసే భారీ వర్షాలకు నావంద్గీ, ఇందర్‌చెడ్ మధ్యన 6.3 టీఎంసీల భారీ వరద నీరు దిగువనున్న కర్ణాటక మీదుగా కృష్ణానది ఉపనది బీమాలో కలుస్తుంది. కాగ్నా నీటిని వ్యవసాయానికి వాడుకోవడానికి 5 దశాబ్దాల క్రితం 1974లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బషీరాబాద్ మండలంలో జీవన్గీ, నావంద్గీ, ఇందర్‌చెడ్, ధారూరు మండలం ధోర్నాల్ దగ్గర నాలుగు ప్రధాన లిఫ్టులను నిర్మించింది. వీటా ద్వారా పరివాహక పరిధి బీడు భూములకు సాగునీరుతో పాటు తాగునీరు ఇవ్వాలని సంకల్పించి ప్రారంభించింది.

ఎత్తిపోతల కింద ఆయకట్టు ఇలా..

ఎత్తిపోతల పేరు	ఆయకట్టు (ఎకరాల్లో..)
నావంద్గీ	550
ఇందర్‌చెడ్	600
జీవన్గీ	600
దోర్నాల్	250
మొత్తం	2,000

❖ పూడుకున్న కాలువలు

కాగ్నా నుంచి మొదటి 20 ఏళ్లపాటు ఎత్తిపోతలు బ్రహ్మాండంగా సాగినా.. తరువాత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో కాలువలు, మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. కరెంటు బిల్లుకు మొదటి నుంచి రెండు దశాబ్దాల వరకు ప్రభుత్వాలు నిధులు కేటాయించాయి. దీంతో పాటు ఆయకట్టు రైతుల నీటి పన్నుల ద్వారా కొనసాగుతూ వచ్చింది. అయితే దోర్నాల్, జీవన్గీ, ఇందర్‌చెడ్ లిఫ్ట్ ఇరిగేషన్లు నిర్వహణ భారంతో 20 ఏళ్లుగా మూత పడిపోయాయి. మోటార్లు కాలిపోయాయి. కాలువలు, నదిలో తీసిన బావులు పూడుకు పోయాయి.

1974లో కాగ్నా నదిపై 4 లిఫ్టుల నిర్మాణం

- 2 వేల ఎకరాలకు సాగు నీరు అందించే సామర్థ్యం
- మూతపడిన మూడు ఎత్తిపోతలు
- నావంద్గీని మాత్రమే పునరుద్ధరించే అవకాశం
- దీన్నికూడా పట్టించుకోని పాలకులు, ఇరిగేషన్ అధికారులు

బషీరాబాద్: జిల్లాలో ఎత్తిపోతల పథకం ఉత్తిగానే మిగిలిపోయింది. కాగ్నా పరివాహక గ్రామాల రైతులకు సాగు నీరు అందించాలన్న సంకల్పంతో కాగ్నాపై ఐదు దశాబ్దాల క్రితం నాటి ప్రభుత్వం నాలుగు ఎత్తిపోతల పథకాలను నిర్మించింది. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీటి నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షించేది. ప్రారంభంలో 2 వేల ఎకరాలకు పైగా సాగునీరు పారడంతో పరిసర ప్రాంతాలు పచ్చని పంట పొలాలతో కళకళలాడేవి. ఆయకట్టు రైతులు వరి, వేరుశనగ, ఇతర ఆరుతడి పంటలు వేసేవారు. కానీ ప్రస్తుతం లిఫ్టులు మూతపడటంతో సాగునీరందక పొలాలు బీళ్లుగా మారిపోయాయి. సాగుకు స్వస్తి చెప్పిన ఆయకట్టు రైతులు కూలీ పనులకు వెళ్తున్నారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యం

ఎత్తిపోతల పథకాలకు సాగు నీటి సంఘాలు ఉండేవి. అయితే వీటిపై ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన నిర్వహణ వ్యయం భారమై ఐడీసీ చేతులెత్తేసింది. దీంతో జిల్లాలోని జీవన్గీ, ఇందర్‌చెడ్, దోర్నాల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మూతపడగా, నావంద్గీ ఆదరణకు నోచుకోలేదు. దీని కారణంగా ఏటా సుమారు 6.3 టీఎంసీల వరద నీరు దిగువనున్న కర్ణాటకకు తరలిపోతోంది. వెరసి నాలుగు లిఫ్టుల కింద ఉన్న 2వేల ఎకరాల ఆయకట్టు భూములు నేడు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి.



బీడుగా మారిన నావంద్గీ ఆయకట్టు భూమి

విద్యుత్ బకాయి రూ.5 లక్షలు

నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణకు వినియోగించిన కరెంటు బిల్లుల బకాయిలు సుమారు రూ.5లక్షల వరకు పేరుకుపోయిందని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. బిల్లులు కట్టాలని ఐదేళ్లుగా ట్రాన్స్ కో అధికారులు ఐడీసీకి చెప్పినా చెల్లించలేదని, సరఫరాను నిలిపివేశారు.

❖ పునరుద్ధరణకు రూ.1.30కోట్లు

బషీరాబాద్ మండల కేంద్రం పక్కనే ఉన్న నావంద్గీ లిఫ్ట్ 2012 వరకు 550 ఎకరాల వరకు సాగునీరు అందించేంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక పునరుద్ధరణ కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.30కోట్ల నిధులు మంజూరు చేసింది. అప్పటి మంత్రి హరీశ్‌రావు, మాజీ మంత్రి, ప్రస్తుత చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి 2017 మే 7న శిలాఫలకం వేశారు. పైప్‌లైన్ కోసం అందులో నుంచి రూ.8లక్షలు నిధులతో పంపునుంచి కాలువల వరకు పైప్‌లైన్‌ను కొత్తగా తవ్వారు. కానీ అది కూడా మూతపడింది. దీంతో ఆయకట్టు రైతులు కొందరు బోర్లువేసుకొని సాగు చేసుకుంటుండగా.. మరి కొందరు బీళ్లుగానే వదిలిపెట్టారు. కాగా.. జీవన్గీ వద్ద కాగ్నాలో రైతులు మోటార్లు బిగించి ఆరుతడి పంటలు వేస్తున్నారు. దిగువన కర్ణాటక ప్రభుత్వం చెక్‌డ్యాం నిర్మించడంతో బ్యాక్ వాటర్ ద్వారా పంటలు పండిస్తున్నట్లు కర్షకులు చెబుతున్నారు. ఒక వేల 4 లిఫ్టులతో పాటు మరికొన్ని లిఫ్టులు నిర్మిస్తే.. 6.3టీఎంసీల నీటిని 40వేల ఎకరాలకు సాగునీటితో పాటు, తాగడానికి వాడుకునే అవకాశం ఉండేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.



బీఆర్ఎస్ ప్రభుత్వం వేసిన శిలాఫలకం

❖ వ్యయం వృథా అని మూత

చిన్న, మధ్య, భారీ సాగునీటి ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో ఒకే గొడుగు కిందకు తెచ్చింది. ఇందులో భాగంగా లిఫ్ట్ ఇరిగేషన్ ఐడీసీ(ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి సాగునీటి శాఖకు బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆ శాఖ అధికారులు ఎత్తిపోతలపై దృష్టి సారించారు. లిఫ్టులు ఎందుకు మూతపడ్డాయి, కరెంటు బిల్లుల బకాయి, ఆయకట్టు భూముల వివరాల లెక్కలు తీశారు. ఇందులో దోర్నాల, జీవన్గీ, ఇందర్‌చెడ్ పునరుద్ధరణ చేయడం మూడు రెట్లు ఖర్చుతో కూడుకున్నదని, తద్వారా రైతులకు మేలు జరగదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో మూడు ఎత్తిపోతల పథకాలు శాశ్వతంగా మూతపడనున్నాయి.

పునరుద్ధరించాలి



జీవన్గీ ఎత్తిపోతల పథకం 20 ఏళ్లుగా మూతపడింది. పాలకులు పట్టించుకోవడం లేదు. దీని కింద నాకు 1.24 ఎకరాల సాగు భూమి ఉంది. లిఫ్టు మూతపడటంతో వాగులో మోటారు పెట్టి, పైప్‌ల ద్వారా పంటలు పండిస్తున్నా. ఎత్తిపోతల పథకం పునఃప్రారంభించి సాగునీరు ఇవ్వాలి. లేని పక్షంలో సోలర్ పంపుసెట్లు ఇస్తే ఆరుతడి పంటలు వేస్తాం.

– బసప్ప, రైతు, జీవన్గీ

నావంద్గీ పునరుద్ధరణకు వీలు



జిల్లాలోని నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్లు ప్రస్తుతం పనిచేయడం లేదు. వీటిని ఇరిగేషన్‌కు అప్పగించిన తరువాత పరిశీలిస్తే నిర్వహణకు భారీగా ఖర్చవుతుందని పేర్కొంది. ఇప్పటికే అన్నింటికీ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మూడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించాం. నావంద్గీని పునరుద్ధరణ చేయాలని నివేదించాం. ఈ లిఫ్టు పనులు పూర్తయితే పూర్తిస్థాయిలో సాగునీరు అందించవచ్చు. ప్రస్తుతం జుంటుపల్లి ప్రాజెక్టు పునరుద్ధరణకు రూ.10 కోట్లతో నివేదిక తయారు చేశాం.

– కిష్టయ్య, డీఈఈ

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్ • వసతిగృహాల తనిఖీ



బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ వార్డెన్లను ఆదేశించారు. గురువారం ఆయన వికారాబాద్ పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహం నంబర్ 1, 2లతో పాటు వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. పరిసరాలను పర్యవేక్షించారు. మెనూ, వంట గది, బియ్యం తదితర సామగ్రిని పరిశీలించారు. ప్రతి రోజు టిఫిన్, భోజనం ఎలా పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. బాత్ రూంలు, మరుగుదొడ్లతో పాటు వసతిగృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఫ్యాన్లు, లైట్లు, మేజర్, మైనర్ రిపేర్ పనులు ఎంత వరకు పూర్తి చేశారని నిర్వాహకులను ప్రశ్నించారు. పనులు పూర్తయిన అనంతరం మరమ్మతుకు ముందు తర్వాత ఫొటోలు తీసి పంపించాలని ఆదేశించారు. బాగా చదువుకొని పదిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. షెడ్యూల్డ్ కులాల జిల్లా అభివృద్ధి అధికారి మల్లేశం, వార్డెన్లు రత్నం, రవీందర్, సుక్రవర్ధన్ రెడ్డి ఉన్నారు.

బైపాస్ పనులు పూర్తి చేస్తాం

- రైతులకు పరిహారం చెల్లిస్తాం
- సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్
- చెంగోల్‌లో సర్వేపనుల పరిశీలన

తాండూరు రూరల్: అసంపూర్తిగా ఉన్న బైపాస్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేస్తామని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిధి చెంగోల్ గ్రామ శివారులో బైపాస్ సర్వే పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన 17 మంది చెంగోల్, అంతారంతండా రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే రికార్డుల్లో ఒకరి పొజిషన్‌లో మరొకరు ఉండటం వలన పరిహారం ఆలస్యమయిందని తెలిపారు. రైతులందరూ కూర్చుని మాట్లాడుకోవాలని సూచించారు. అందరూ ఒకే మాటమీద ఉంటే.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం త్వరగా అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. తహసీల్దార్ తారాసింగ్, సర్వేయర్ మహేశ్, ఆర్ఐ గోపి, జూనియర్ అసిస్టెంట్ బాబు, నాయకులు రాముయాదవ్, సంపత్, కృష్ణయ్య, హన్మంత్, నాగేశం, రాజు ఉన్నారు.



బైపాస్ సర్వే పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆందోళన వద్దు

బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు ఆందోళన చెందవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన విడిగా.. చెంగోల్లో రోడ్డు సర్వేను రైతులతో కలిసి పరిశీలించారు.

మేమున్నామని..

- తోటి ఉద్యోగుల దాతృత్వం
- ఎక్సైజ్ కానిస్టేబుల్ వైద్యానికి రూ.8 లక్షలు సాయం
- ఒకరోజు వేతనం అందజేత



సురేందర్ తల్లిదండ్రులకు చెక్‌ను అందజేస్తున్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు

అనంతగిరి: ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌కు యాక్సిడెంట్ కావడంతో రూ.8.02 లక్షలు ఇచ్చి తమ మానవత్వాన్ని చాటుకున్నారు ఉమ్మడి రంగారెడ్డి డివిజన్ ఆ శాఖ అధికారులు, సిబ్బంది. వికారాబాద్ ఎక్సైజ్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న సురేందర్.. గత నెలలో వికారాబాద్ పట్టణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో కాలికి తీవ్ర గాయాలయ్యాయి. మోకీలు చిప్ప మార్పిడి అనివార్యం అయింది. ఇందుకు వైద్య ఖర్చులకు రూ.లక్షలు వెచ్చించాల్సి ఉంది. కానిస్టేబుల్‌ది నిరుపేద కుటుంబం కావడంతో.. శాఖ అధికారులు, సిబ్బంది మేమున్నామంటూ ముందుకు వచ్చారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఒకరోజు వేతనం చెక్కును గురువారం నగరంలోని ఆబ్కారీ భవన్‌లో కమిషనర్ చేవూరి హరికిరణ్, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్ చేతుల మీదుగా సురేందర్ తల్లిదండ్రులకు అందజేశారు. వికారాబాద్, శంషాబాద్, మల్కాజ్‌గిరి, సరూర్‌నగర్ డీపీఈఓలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. కష్టాల్లో ఉన్న తోటి ఉద్యోగికి మేమున్నామంటూ అండగా నిలిచినవారికి ఎక్సైజ్ సీఐ రాఘవీణ, ఎస్ఐలు శ్రీనివాస్, వీరాంజనేయులు ధన్యవాదాలు తెలిపారు.

దుద్యాలలో తాత్కాలిక పోలీస్ స్టేషన్

- హకీంపేట్ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల
- కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి


దుద్యాల్: లగచర్ల ఘటన నేపథ్యంలో దుద్యాల మండల కేంద్రంలో తాత్కాలిక పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందుకు గురువారం పల్లె దవాఖానను కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ కిషన్, పంచాయత్‌రాజ్ ఏఈ సురేందర్‌రెడ్డి రెడ్డి, ఎస్ఐ రహాఫ్‌లు పరిశీలించారు. అనంతరం కడా అధికారి మాట్లాడారు. దుద్యాల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అందుకు అవసరమైన నిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంజూరు చేయనున్నారని వెల్లడించారు. అందులో భాగంగానే తొలుత తాత్కాలికంగా ఆస్పత్రిలో ఠాణా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఠాణాతో పాటు.. హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనాలు నిర్మించేందుకు స్థల పరిశీలన చేశామని చెప్పారు. ఇదిలా ఉండగా.. హకీంపేట్‌లో ఇది వరకే జూనియర్ కళాశాల మంజూరు అయిన విషయం తెలిసిందే. ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనాల్లోనే జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయరామారావ్, ఉప తహసీల్దార్ వీరేశ్‌బాబు, రెవెన్యూ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పల్లె దవాఖానను పరిశీలిస్తున్న కడా అధికారి

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి



పెంజర్లలో దరఖాస్తుదారులతో మట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో అధికారులు చేపడుతున్న సర్వేను కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అర్హుల ఎంపికలో అనుసరించాల్సిన విధి విధానాలను అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. అనంతరం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులకు సలహాలు ఇచ్చారు. ఇష్టపడి చదువుతేనే ఉన్నతంగా రాణిస్తారని చెప్పారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య సబ్‌సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. పెంజర్లలోని సబ్‌సెంటర్ పరిధిలో రికార్డులను పరిశీలించిన ఆయన ఎక్కువ అబార్షన్ కేసులు నమోదైనట్లు గుర్తించారు. వివరాలను సమర్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీఓ అరుంధతి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీఓ విజయలక్ష్మి, పలు శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రెండు ఆర్‌ఎంపీ చికిత్స కేంద్రాల సీజ్


రుక్మిణి ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

నవాబుపేట: నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నారనే కారణంతో రెండు ఆర్‌ఎంపీ కేంద్రాలను వైద్యాధికారులు గురువారం సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నవాబుపేటలోని రుక్మిణి ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేసి, ఆర్‌ఎంపీ వైద్యుడిగా చలామణి అవుతున్న లక్ష్మణ్ నిర్వహిస్తున్న రుక్మిణి ప్రథమ చికిత్స కేంద్రం, ఇతను నిర్వహిస్తున్న మెడికల్ షాప్‌ను సీజ్ చేశారు. అనంతరం పులుమామిడిలోని కుమార్ ప్రథమ చికిత్స కేంద్రాన్ని సైతం సీజ్ చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్ తెలిపారు. రెండు చోట్లా తెలిసీ తెలియని వైద్యంతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు దాడులు నిర్వహించారు.

'ఆశ'ల సమస్యలు పరిష్కరించండి


యాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆశ వర్కర్లు

పరిగి: ఆశ వర్కర్ల సమస్యలను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఆశ వర్కర్ల జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 నుంచి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశలు రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టనున్నారని తెలిపారు. ఈ నెల 21న జిల్లాలో యాత్ర ప్రవేశించి 22న పరిగి, కొడంగల్‌కు రానుందని, యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం ఆశల శ్రమను దోచుకుంటుందని ఆరోపించారు. వారికి ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చేయాలని, బీమా సౌకర్యం, ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


సహపంక్తి భోజనం చేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు 14 రోజులుగా వికారాబాద్‌లోని ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం వంటావార్పు చేసి, సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కేతావత్ గాంగ్యనాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెండు దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. హామీ మేరకు సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభావతి, ప్రభాకర్, శేఖర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపేదెవరు?

- పర్మిషన్ ఏడు ట్రాక్టర్లు.. పరుగులు పెడ్తున్నవి 17
- ఖాంజాపూర్ వాగులో ఇసుక దోపిడీ
- అభివృద్ధి పేరిట పక్కదారి


ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

తాండూరు రూరల్: అనుమతులు లేకుండా ఒకరు. పర్మిషన్ పేరిట మరికొందరు పట్టపగలే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. తాండూరు మండలం ఖాంజాపూర్ కాగ్నావాగు నుంచి కొన్ని రోజులుగా అక్రమంగా ఇసుక తరలిపోతోంది. ఖాంజాపూర్ వాగు నుంచి తాండూరు పట్టణానికి భారీగా ఇసుకను డంప్ చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. తోడుకున్నోడికి తోడుకున్నంత అంటూ తరలిస్తున్నారు.

తనిఖీలు శూన్యం..

గతంలో మైనింగ్, రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చేవారు. మైనింగ్ కార్యాలయం నుంచి ఓ సిబ్బంది వాగులో ఉంచి వే బిల్లులు అందజేసిన తర్వాత, ఇసుక లోడుతో ట్రాక్టర్ వాగు నుంచి బయటకు వచ్చేది. ప్రస్తుతం మైనింగ్ అధికారుల తనిఖీలు లేకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

దేవుడి పేరిట.. పక్కదారి

అభివృద్ధి పేరిట పర్మిషన్ తీసుకుని అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారు. అయితే తహసీల్ కార్యాలయం నుంచి పర్మిషన్ ఇస్తున్న అధికారులు.. ఆ తరువాత ఇసుక ఎక్కడ డంప్ చేస్తున్నారో కూడా తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇసుక మాఫియాతో రెవెన్యూ అధికారులు చేతులు కలిపారన్న విమర్శలు లేకపోలేదు. పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నసత్రం నిర్మించేందుకు కొందరు పర్మిషన్ తీసుకొని ఇష్టానుసారంగా అక్రమంగా తరలించి సొమ్ముచేసుకుంటున్నారు.

అరకొర అనుమతులు

ఇసుక తరలింపునకు తహసీల్ కార్యాలయం నుంచి వివిధ అభివృద్ధి పనుల పేరిట ఖాంజాపూర్ వాగు నుంచి తాండూరు పట్టణానికి తహసీల్దార్ తారాసింగ్ 7 ట్రాక్టర్లకు మాత్రమే అనుమతి ఇచ్చారు. కానీ ఖాంజాపూర్ వాగు నుంచి సుమారు 17 ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలి పోతోంది. ఎలాంటి పర్మిషన్ లేకుండా 10 ట్రాక్టర్లు అక్రమంగా రవాణా చేస్తున్నాయి. ఇసుక తరలిస్తున్న వాహనాలకు కనీసం నంబర్ ప్లేట్లు కూడా లేకపోవడం గమనార్హం.

ఏడు ట్రాక్టర్లకే పర్మిషన్లు



ఖాంజాపూర్ వాగు నుంచి వివిధ అభివృద్ధి పనులకు కేవలం 7 ట్రాక్టర్ల ఇసుకకు మాత్రమే అనుమతి ఇచ్చాను. ఆ లెటర్‌లో ఎక్కడి నుంచి ఎక్కడికి తరలించాలో క్షుణ్ణంగా ఉంది. అక్రమంగా తరలిస్తే మా బాధ్యత కాదు. సిబ్బంది కొరతతో అక్రమ రవాణాను అడ్డుకోవడం కష్టం. పర్మిషన్‌కు డబ్బులు తీసుకుంటున్నామన్న మాట అవాస్తవం.

– తారాసింగ్, తహసీల్దార్, తాండూరు

ఫిర్యాదు చేస్తే కేసులు..



ఇసుక పర్మిషన్ ఇచ్చే బాధ్యత రెవెన్యూ అధికారులదే. అక్రమంగా తరలిస్తున్నారన్న ఫిర్యాదు వస్తే తనిఖీలు చేపట్టి, కేసులు నమోదు చేస్తాం. వారం క్రితం ఖాంజాపూర్ వ్యక్తిపై కేసు నమోదు చేశాం. సిబ్బందితో ట్రాక్టర్లను తనిఖీలు చేయిస్తున్నాం.

– సంతోష్‌కుమార్, సీఐ, తాండూరు పట్టణం

పెండింగ్ కేసులు లేకుండా చూడాలి

డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి


కోట్‌పల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

బంట్వారం: పెండింగ్ కేసులు లేకుండా చూడాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్ కేసులు తదితర అంశాలపై చర్చించి మాట్లాడారు. నేరాల నియంత్రణకు రాత్రి వేళ గస్తీ ముమ్మరం చేయాలన్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో ముందు వరుసలో ఉండాలన్నారు. అసాంఘిక శక్తులపై నిఘా పటిష్టం చేయాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ధారూరు సీఐ రఘురాములు, కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి


పోలీసు శాఖకు బారికేడ్లు అందజేస్తున్న ప్రైవేటు విద్యాలయాల యజమానులు, సిబ్బంది

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రైవేటు పాఠశాల, కళాశాల యాజమాన్యాల అసోసియేషన్ తరపున పోలీసు శాఖకు 25 ట్రాఫిక్ బారికేడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభా, వాహనాల దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను కొందరు వాహనదారులు ఉల్లంఘించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మైనర్లు, లైసెన్స్ లేని వారు, మద్యం తాగి వాహనాలు నడపడాన్ని అరికడతామని వెల్లడించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో వినియోగించే బారికేడ్లను పాఠశాల, కళాశాలల యాజమాన్య సభ్యులు పోలీసు శాఖకు అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాల, కళాశాల యాజమాన్య సభ్యులు రంగారావు, నరేందర్, సంగీత, రామకృష్ణ, కిరణ్, సతీష్, శివ, రవీందర్ రెడ్డి, మోహన కృష్ణ, యూనుస్, అభిలాష్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కవిత, కల్పన, వాహిద్, సలీం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయం


కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: నగర అభివృద్ధికి కృషి చేసిన కొరివి కృష్ణస్వామిముదిరాజ్ సేవలను చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. గురువారం కృష్ణస్వామిముదిరాజ్ వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైదారాబాద్ తొలి మేయర్, స్వాతంత్య్ర సమరయోధుడు కృష్ణస్వామి ముదిరాజ్ అన్నారు. ఆయన నగరంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ముందు తరాలకు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ మాణిక్యం, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముకుంద నాగేశ్వర్, ముదిరాజ్ సంఘ నాయకులు కృష్ణ, బాలు, యాదయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నగేష్


ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆంజనేయులును సన్మానిస్తున్న నేతలు

కుల్కచర్ల: ముదిరాజ్ నాయకులకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం లభించడం హర్షించదగ్గ విషయమని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముకుంద నగేష్ అన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో నూతనంగా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఆంజనేయులు ముదిరాజ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జనాభాలో అధికశాతం ఉన్న ముదిరాజ్ ప్రజలు జెండాలు మోయడానికే పరిమితం అవుతున్న పరిస్థితిలో ఆంజనేయులు ముదిరాజ్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాణిక్యం, బాలు, ఆంజనేయులు, వెంకటయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

తాండూరు కందులకు డిమాండ్

క్వింటాలుకు గరిష్ట ధర రూ.8,631


తాండూరు మార్కెట్‌లో కందులు

తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో కంది ఉత్పత్తుల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన బిడ్డింగ్‌లో 1,341 క్వింటాళ్ల కందులకు విక్రయాలు జరిగాయి. క్వింటాలు కందులకు కనిష్ట ధర రూ.7,550, గరిష్ట ధర రూ.8,631, సగటు ధర రూ. 8,505 చొప్పున పలికాయి. గత నెల రెండో వారం నుంచి ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట ఉత్పత్తులు మార్కెట్‌కు తరలి వస్తున్నాయి. మరోవైపు వరి ధాన్యం(సోన రకం) క్వింటాలుకు కనిష్ట ధర రూ.2,385, గరిష్ట ధర రూ.2,565, సగటు ధర రూ.రూ.2,502 చొప్పున పలికాయి. సోయా క్వింటాలుకు రూ.3,321 చొప్పున పలికాయి. దొడ్డు రకం వరి క్వింటాలుకు 2,295 చొప్పున పలికాయి. తాండూరు కందులకు మార్కెట్‌లో డిమాండ్ పలుకుతోంది. ప్రభుత్వ మద్దతు ధర కంటే అధికంగా కందులకు ధర లభిస్తోంది.

నేడు సీఎం కప్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం సీఎం కప్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు పీడీలు అనిల్, అజీజ్‌లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి విద్యార్థులు కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు కొడంగల్‌కు రానున్నట్లు చెప్పారు. ఉదయం 9–30గంటల నుంచి టోర్నమెంట్ ప్రారంభం కానుందన్నారు.

దుద్యాల్‌లో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

దుద్యాల్: మండల కేంద్రంలో సెర్ప్, డీఆర్‌డీఏ సహకారంతో గురువారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెర్ప్ పీఎం ఉమాపతి మాట్లాడుతూ ప్రధాన మార్కెట్లలో కందుల ధరలు తగ్గించడంతో రైతులు నష్టపోతున్నారని, వారు నష్టపోకుండా కేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మార్కెట్లో ఉన్న ధరకు కొనుగోలు చేయడంతో పాటు కమీషన్, తరుగు తీయమని తెలిపారు. కొనుగోలు కేంద్రం మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతుందని వెల్లడించారు. సీడీఓ వినోద్ రెడ్డి, డీపీఎం శేఖర్, ఏపీఎం సత్యం ఉన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

దోమ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంటులో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా మెంబర్ రమేశ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత పదవుల్లో ఉండి అంబేడ్కర్‌ను అవమానించడం సరికాదని హితవు పలికారు. ఆయన మాటలను వెనక్కి డిమాండ్ చేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులు 2024– 2025 సంవత్సరానికి ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం జనవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరిధి విద్యార్థుల వివరాలతో టీజీ ఈపాస్ వెబ్ సైట్లో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తు అనంతరం సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందచేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని సంక్షేమ అధికారిని ఎస్ 9 కార్యాలయం లేదా 9502912981లో సంప్రదించాలని సూచించారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం


ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పరిగి: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి నిరసనగా.. గురువారం రాత్రి ఆ పార్టీ శ్రేణులు పరిగి బస్టాండ్ ఎదుట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు


కుల్కచర్ల: మాలమహానాడు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు


కొడంగల్ రూరల్: ఠాణా ఆవరణలో మాల సంఘాల నాయకులు

మాలమహానాడు జిల్లా అధ్యక్షులు వెంకటేశ్

కుల్కచర్ల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు బి.వెంకటేశ్ అన్నారు. మాలల చలో అసెంబ్లీ పిలుపు నేపథ్యంలో గురువారం మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన మాలమహానాడు కార్యకర్తలు, నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పేరుతో కొంతమంది నాయకులు పదవులు దక్కించుకోవాలని చూస్తున్నారు తప్పిస్తే బలహీనవర్గాల ఎటువంటి మేలు చేకూర్చరని అన్నారు. అవకాశవాద రాజకీయాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణను నిలుపుదల చేయాలని పేర్కొన్నారు. అక్రమంగా అరెస్టులు చేస్తే ఉద్యమం ఆగదని చెప్పారు. మాలమహానాడు మండల అధ్యక్షులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అరెస్టులు సరికాదు

కొడంగల్ రూరల్: రాష్ట్ర మాల సంఘాల పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన ‘హలో మాల చలో అసెంబ్లీ’ కార్యక్రమానికి తరలుతున్న నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని మాల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాల వెంకటేశం అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ తమ ఆవేదనను వ్యక్తం చేయడానికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఎంత మంది ఎస్సీలు ఉన్నారో తేల్చకుండా ఏ విధంగా ఎస్సీ వర్గీకరణ చేపడతారని ప్రశ్నించారు.

ముందస్తు అరెస్టు

అనంతగిరి: మాల మహానాడు అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో గురువారం పోలీసులు పలువురు మాల మహానాడు నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఇందులో భాగంగా వికారాబాద్‌కు చెందిన మాలమహానాడు జిల్లా సలహాదారుడు అనంతరాములును ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు.

నాయకుల అరెస్ట్

తాండూరు రూరల్: అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న మాల మహానాడు నాయకులను కరన్‌కోట్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. తాండూరు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు శనప్ప, కృష్ణ, మల్లప్ప, జగదీష్, విజయ్‌కుమార్, గోవింద్, కాశప్పలు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి బయలుదేరారు. వీరని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

నవాబుపేటలో..

నవాబుపేట: మాల మహానాడు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న నాయకులను పోలీసులు ఉదయం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అక్రమ అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని నేతలు పేర్కొన్నారు.

రాత పరీక్ష రద్దు చేయాలి

- ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి మైపాల్

అనంతగిరి: కాంట్రాక్టు ఏఎన్‌ఎంలకు రాత పరీక్ష రద్దు చేసి, అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మైపాల్ డిమాండ్ చేశారు. గురువారం కాంట్రాక్టు ఏఎన్‌ఎంల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వికారాబాద్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట 48గంటల నిరవధిక సమ్మె చేపట్టారు. రాత్రి వంటావార్పు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా గ్రామాల్లో, పీహెచ్‌సీలలో ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారని వెల్లడించారు. అందరికీ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లీలావతి, లలిత, వెంకటమ్మ, కవిత, వెంకటమ్మ, రోజా, భారతి, రజియా, చంద్రకళ, మల్లమ్మ, అని త, యాదమ్మ, సత్యమ్మ, పద్మ, సుజాత, జయశీల, స్వరూప, చంద్రకళ, రాములమ్మ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు

పేదరికం.. చికిత్స భారం!

- చిరు వ్యాపారికి పెద్ద ఆపద
- ఎమ్మెల్యే, దాతలు ఆదుకోవాలని అభ్యర్థన


మంచానికే పరిమితమైన రాజశేఖర్


ప్రైవేటు ఆస్పత్రి బిల్లులు చూపుతున్న రాజశేఖర్ దంపతులు

తాండూరు టౌన్: కాలేయ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న ఓ చిరు వ్యాపారి దినదిన గండంలా కాలం వెళ్లదీస్తున్నారు. రోజుకు రూ.8 వేల విలువైన ఇంజక్షన్లు చేయిస్తే ప్రాణాలతో బయటపడే అవకాశం ఉందని వైద్యులు పేర్కొన్నారు. కానీ చుట్టుముట్టిన పేదరికంతో చికిత్స భారంగా మారిందని తాండూరు పట్టణానికి చెందిన కల్లూరు రాజశేఖర్ తన దీనగాథను వెల్లడిస్తున్నాడు. ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నాడు.

రూ.3 లక్షలు కావాలి

పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన రాజశేఖర్.. భార్య సునీత, ఓ కూతురుతో కలిసి అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. జీలకర్ర, దాల్చిన చెక్క, ఇలాచీలు చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి కిరాణా దుకాణాలకు సరఫరా చేసి, వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించేవారు. 2008లో ఆయనకు కాలేయ సంబంధిత వ్యాధి ప్రారంభమైంది. అప్పటినుంచి మందులు వాడుతూనే ఉన్నారు. మధ్యలో కొన్నేళ్ల పాటు కోలుకోగా, మళ్లీ రెండేళ్లుగా వ్యాధి తిరగబెట్టింది. దీంతో వ్యాపారం నిలిచి పోయి, ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిత్యం పని చేసుకుని బతికే తమకు ఇలాంటి కష్టాలు వచ్చాయని ఇంటిల్లిపాది విచారం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పాటు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తిరిగి రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఈక్రమంలో ఏడాదిగా ఇంటి కిరాయి సైతం చెల్లించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యానికి డబ్బులు లేక రెండు నెలలుగా నిమ్స్‌లో చికిత్స తీసుకుంటున్నారు. హైదరాబాద్‌కు వెళ్లి రావడానికి సైతం కిరాయి చార్జీలు లేవని వాపోతున్నారు. కొన్నాళ్ల పాటు రోజుకు రూ.8 వేల విలువైన ఇంజక్షన్లు తీసుకుంటేనే వ్యాధి నయమయ్యే అవకాశం ఉందని నిమ్స్ వైద్యులు తెలిపారు. కోర్సు పూర్తయ్యేందుకు సుమారు రూ.3 లక్షల అవుతాయని చెప్పారు. ఎవరైనా దాతలు ఆపన్నహస్తం అందించాలని రాజశేఖర్ దంపతులు దీనంగా అభ్యర్థిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పందించి, ప్రభుత్వం తరపున వైద్య సాయం చేయించాలని వేడుకుంటున్నారు. దాతలు కూడా సహకరించి, ప్రాణం నిలబెట్టాలని కోరుతున్నారు. ఫోన్ నంబర్ 90592 94199 ద్వారా సహాయం చేయాలని ప్రార్థిస్తున్నారు.